

# దశమావతారం

తాడికొండ
కె. శివకుమార శర్మ



అనగనగా ఒక ఇంటి యజమాని ఎలుకల బాధని తట్టుకోలేక ఒక పిల్లిని పెంచడం మొదలుపెట్టాడు. అయితే, ఆ పిల్లి తేలిగ్గా దొరికే పాలు, వెన్నలని మరిగివుండడం చేత ఎలుకల మీద అంత ఆసక్తిని చూపలేదు. తొందరలోనే పిల్లలని కూడా పెట్టి, వాటితో కలిసి ఇల్లుపీకి పందిరి వెయ్యడం మొదలుపెట్టింది. ఆ పిల్లిని కంట్రోల్ చెయ్యడానికి అతను ఒక కుక్కని తెచ్చాడు. పూర్వజన్మలో ఆ రెండూ మొగుడు, పెళ్ళాలైతే అయి వుండొచ్చుగానీ ఈ జన్మలో మాత్రం ఎంతో సఖ్యంగా వుండడం మొదలుపెట్టి, చూపరులకి ఆశ్చర్యాన్ని కలుగజేశాయి. పైగా, అది ఆడకుక్కవడం వల్ల మగ వూరకుక్కలన్నీ ఆ యింటి ముందే తారట్లాడడం మొదలుపెట్టాయి. పెంపుడు కుక్కయ్యే సరికి, ఎక్కడికి తీసుకుని వెళ్ళి వదిలి వచ్చినా మళ్ళీ అలవాటైన చోటికే వచ్చేది.



ఆ యజమాని పెంపుడు జంతువుల బాధ తట్టుకోలేక సతమతమవుతున్న సమయంలో ఆ వూళ్ళోకి వూరేగింపుతో ఒక సర్కస్ వస్తున్నపుడు వూరకుక్కలు మొరిగితే చలించిపోగా, తొండంతో విసిరిగొట్టి కుక్కల్ని తోక ముడిపించిన ఏనుగుని చూసి దాన్ని తెచ్చి పెంచుకోవడమే మార్గమనుకున్నాడు.

ఆ తరువాత?

***

ఒక ఇల్లు కూలిపోయింది – వానలొచ్చీ, వరదలొచ్చీ కాదు. ఎలుకల వల్లా, ఏనుగుల వల్లా అసలే కాదు. జస్ట్ – వున్నట్టుండి, అంతే. అదృష్టవశాత్తు, ఆ యింట్లో వాళ్ళు కొద్ది దెబ్బలతో మాత్రం తప్పించుకున్నారు.

ఆ యింటివాళ్ళు కట్టినవాణ్ణి ''కూలిపోయేలా ఎట్లా కట్టా''వని నిలదీశారు.

''నేను మామూలుగానే కట్టాను, ఈ యింటికి ప్రత్యేకించి లోపమేమీ చెయ్యలే''దన్నాడు వాడు.

''ఉచితంగా మళ్ళీ ఇల్లు కట్టివ్వ''మని డిమాండ్ చేశారు కూలిన ఇంటివాళ్ళు.

ఇల్లు కట్టినవాడు నవ్వేసి, ''నేను తప్పేమీ చెయ్యలేదు. మెటీరియల్ ధరలు పెరిగిపోయాయి. లేబర్ ఛార్జీలు పెరిగిపోయాయి. మళ్ళీ కట్టివ్వాలంటే ఒరిజినల్ ధరకన్నా ఎక్కువ ఇస్తేనే తప్ప కుదర''దన్నాడు.


చుట్టుపక్కల వాళ్ళందరూ, అడ్డమైన వాళ్ళూ ఇల్లు కట్టడం వల్ల ఆ యిల్లు కూలిందని తీర్మానించారు.

అంతటితో ఆగకుండా, ప్రభుత్వాన్ని పాఠశాలలు పెట్టి ఇళ్ళు కట్టించడానికి కావలసిన శిక్షణనిప్పించమన్నారు. ఆ పాఠశాలల్లో చదువుకుని, అక్కడ పెట్టే పరీక్షల్లో ఉత్తీర్ణులైన వాళ్ళే ఇళ్ళు కట్టడానికి అర్హులు కావాలన్నారు. ప్రజల ఆజ్ఞని శిరసావహించి ఆ పాఠశాలల్ని పెట్టడమే కాక, ఆ అర్హతలని చాటుకోవడానికి వీలుగా ప్రభుత్వం పట్టాలను కూడా ఇవ్వడం మొదలుపెట్టింది.

పట్టభద్రులు ఇళ్ళు కట్టడం మొదలుపెట్టిన తరువాత కూడా కొన్ని ఇళ్ళు కూలాయి.

విచారణకై ప్రభుత్వం నియమించిన కమిషన్, ఇళ్ళు కట్టడం నేర్పడం కోసం హడావుడిగా పాఠశాలల్ని పెట్టడం వల్ల, ఆ కట్టడాల్ని గూర్చి బోధించేటందుకు క్వాలిఫికేషన్లు లేనివాళ్ళకి టీచర్లుగా పోస్టింగులు ఇచ్చారని తేల్చింది. ఉన్న పోస్టులని నింపాలంటే, ''గోడమీద మేకులు కొట్టడం వస్తే చాలు'' అని వుద్యోగార్థులని నిర్ణయిస్తే తప్ప కుదరదని గుర్తించి, అప్పటిదాకా నిరుద్యోగులైన పాఠశాలల ఛైర్మన్ల మేనల్లుళ్ళకీ, సెక్రెటరీల కొడుకులకీ ఉద్యోగాలిచ్చి ఇన్ని పట్టాలిప్పిస్తే, గౌరవించాల్సింది పోయి మమ్మల్ని ఇన్నేసి మాటలంటారా అని వందనీయులైన పాఠశాలల ప్రిన్సిపాళ్ళు, వ్యవస్థాపకులు ప్రభుత్వం మీద కినుక వహించడంతో, ''అవును కదా, ఇన్ని పాఠశాలల్ని పెట్టడానికి కావల్సినంత మంది పట్టభద్రులైన టీచర్లు అప్పటికప్పుడు ఎట్లా పుట్టుకొస్తార్?'' అని ప్రభుత్వం గ్రహించినదై కమిషన్ రిపోర్టును అటకమీద పడేసింది.

అలాగని, ఆ అవకాశాన్ని ప్రభుత్వం ఉపయోగించుకోకుండా వదల్లేదు. ట్రైనింగ్ పేరిట కొంతమందిని ప్రజల డబ్బుతోనే విదేశాలకు పంపింది. అట్లా పంపిన బృందంలో మంత్రివర్యుల, ఉన్నతాధికారుల సంతానం మాత్రమే వున్నారని గిట్టని వాళ్ళంటే,




''కానే కాదు, ఏదో ఒక వేలు తప్పనిసరిగా చితగ్గొట్టుకుంటూ గోడకి మేకులు కొట్టే నేర్పరితనం ఇంకెవ్వరిలోనూ మాక్కనిపించలేదు'' అంది ప్రభుత్వం. ఆ నేర్పరితనాన్ని కలుగజేసేలా మేం మీకు ట్రైనింగ్ నిస్తాం అంటూ పుట్టకొక్కుల్లాగా లేచెయ్ ట్రైనింగ్ స్కూళ్ళు. ఆ ట్రైనింగ్ అవకాశాల్ని తమ పిల్లలు పొంది వాళ్ళు కూడా విదేశాలు వెళ్ళచ్చుగదా అన్న ఉద్దేశంతో ఇల్లుగల వాళ్ళు అవసరమైతే ఇంటిని తాకట్టుపెట్టి, లేనివాళ్ళు ట్రైనింగుకై బాంకులిచ్చిన అప్పుల్ని స్వీకరించి, తమ పిల్లలని ట్రైనింగ్ స్కూళ్ళల్లో చేర్పించారు. అలా చేర్పించిన వాళ్ళల్లో ఇల్లు కూలిన వాళ్ళు కూడా వున్నారు.

ఏదియేమైనా, కొన్నేళ్ళ తరువాత విదేశీ పట్టాలు పుచ్చుకుని తిరిగి వచ్చిన వాళ్ళు స్వదేశీయులకి పట్టాలిప్పించడం మొదలుపెట్టారు.

అయినా ఇళ్ళు కూలాయి.

ఈసారి, ఇళ్ళు కట్టించేవాళ్ళు, తప్పు తమది కాదు, సిమెంటుదన్నారు.

ప్రభుత్వం సిమెంటు తయారుచేసే వాళ్ళమీద విరుచుకుపడింది. అయితే, సిమెంటు మీద కదా పడడం, అందుకని బాగా గట్టిగానే దెబ్బ తగిలింది.

సిమెంటు కంపెనీలక్కోపం వచ్చింది. తాము తయారుచేసే సిమెంటు క్వాలిటీయే దానికి కారణం అయ్యేట్లయితే, మంత్రివర్యుల ఇళ్ళు గానీ, కోటీశ్వరుల ఇళ్ళు గానీ కూలట్లేదెందుకని వాళ్ళు వాదించారు. ఈ వాదన కోట్లు లేకుండా తిరిగే వాళ్ళు వింటే తన పరువు పోతుందని భావించిన ప్రభుత్వం, సిమెంటు కంపెనీ వాళ్ళకు క్షమాపణలు చెప్పుకుని, వాళ్ళను బుజ్జగించి, వోట్లేసే వాళ్ళ కళ్ళ నీళ్ళు తుడవటానికై, సిమెంటు నాణ్యతని సర్టిఫై చెయ్యడం కోసం ఒక డిపార్ట్‌మెంట్‌ని సృష్టించింది. కొంతమంది కావల్సిన వాళ్ళకి ఉద్యోగాలు వేయిద్దామనుకోవడం అసలు కారణమన్నారు గిట్టనివాళ్ళు.

ఆ డిపార్ట్‌మెంట్‌లో వాళ్ళకి మొదట్లో చెయ్యడానికి పనులేవీ లేక, ఈగలు తోలడంతో జాబ్ శాటిస్‌ఫాక్షన్ వుండడం లేదని, సిమెంటు నాణ్యతని సర్టిఫై చెయ్యడమే గాక, అసలు ముందు భవనాలు కట్టడానికి కూడా పర్మిట్లు ఇస్తాం అన్నారు. చెవిలో జోరీగ బాధ పడలేక ప్రభుత్వం సరేనంది.

అయినా ఈగలు తోలడం తప్పని పరిస్థితిలో వుండగా ఒకళ్ళు బిల్డింగ్ పర్మిట్‌కి అప్లై చెయ్యడానికి వచ్చారు. ఆ పర్మిట్ మీద ఆఫీసర్ గారు సంతకం పెట్టబోతుండగా ఒక ఈగ ఆ కాగితం మీద వాలింది. ఆఫీసర్ గారు ఆ పాటికి ఈగలు పట్టడంలో నిపుణతని సంపాదించి వుండడం చేత అప్రమత్తతతో ఓ పుస్తకంతో దాన్ని చంపి, ఆ తర్వాత సంతకం పెట్టి, ప్యూన్ చేత ఆ పర్మిట్‌ని కింద క్లర్క్‌కి పంపించాడు.

''చచ్చిన ఈగని పర్మిట్ మీద పెట్ట''మంటే నేనే ఆ పని చేసేవాణ్ణి కదా అని ఆ క్లర్కుగారు కోపగించి, ఆ పేజీ మీద ఈగ వున్న స్థానమేదో కొలిచి చూసి, ప్రతీ పర్మిట్ మీదా ఒక చచ్చిన ఈగని సరిగ్గా అదే స్థానంలో, అంతే పేజీకి పై అంచునించీ నాలుగంగుళాలు కిందా, ఎడమ అంచునించీ రెండూ ముప్పావు అంగుళాల దూరంలోనూ అతికించి, ఆఫీసరు గారి దగ్గరికి సంతకానికి పంపించడం మొదలెట్టారు. త్వరలోనే ఆయనకు ''ఈగలు పట్టే క్లర్కు''గా పేరు రావడంతో, ఈగల్ని సప్లై చేసేటందుకు ఒక మనిషిని డబ్బిచ్చి పెట్టుకున్నాడు.

సదరు ఆఫీసరు గారికి ప్రతీ పర్మిట్ కాగితం మీదా ఒకేచోట ఒక చచ్చిన ఈగ ఎందుకు వుంటోందో అర్థంకాక, అడుగుదామంటే నీకా జీవో తెలీదా అని క్లర్కు గారిచేత అనిపించుకోవాల్సొస్తుందేమోనని భయపడి, ఆయన మాట్లాడకుండా సంతకం పెట్టేవారు. ఒకరోజున క్లర్కు గారు ఈగల్ని సప్లై చేసేవాడికి డబ్బులివ్వగా చూసినప్పుడు, ఆయన బుర్రలో ఓ ఆలోచన తళుక్కున మెరిసి, క్లర్కుగారికి గీతోపదేశం చేశారు. ''చూడు నాయనా, ఈగలు సప్లై చేసే వాడికి నువ్వు డబ్బు ఇవ్వడం అవివేకం. దీనికి స్టాంపు ఫీజు అన్చెప్పి డబ్బు వసూలు చెయ్యి. ఖర్చులు పోగా మిగిలిన తొంభైశాతంలో ముప్పాతిక నాకు, మిగిలింది నీకు.''

క్లర్కు గారికి కొన్నాళ్ళు ఈ పద్ధతి నచ్చినా, తాను ఒక స్కూటర్ కొనేటప్పటికి స్కూటర్ల డీలర్‌షిప్ పెట్టిన ఆఫీసరు గారిని చూసి, వర్కర్‌గా కంటే కన్సల్టెంట్‌గా ఎక్కువ లాభాన్ని పొందవచ్చునని గ్రహించారు. బుద్ధిచాతుర్యం గల క్లర్కుగారు, ఈగలకి స్టాంపు ఫీజు పుచ్చుకుంటూనే పర్మిట్ పేపర్ మీద ఈగలని పెట్టడం మానేశారు. ఈగల వల్ల సంపాదన

లేక జేబు బరువు తగ్గుతున్నదని ఆగ్రహించిన ఆఫీసరు గారు ''ఇంకనించీ నేనే ఈగలు పట్టుకోవాలా?'' అని క్లర్కుగారిని నిలదీశారు. క్లర్కుగారు ధైర్యంగా పర్మిట్ మీద చచ్చిన ఈగ వుండాలని ఏ జీవోలో వున్నదో చూపించమని అడిగారు.

ఖంగుతిన్న ఆఫీసరుగారు సమయస్ఫూర్తితో, ''ఈగల బెడదని తప్పించి మనం హెల్త్ డిపార్ట్‌మెంటు వాళ్ళకి కూడా మేలు చేస్తున్నాం. ఇప్పుడు ఈ పనిని మనం ఆపేస్తే వాళ్ళు పనిచెయ్యాల్సొస్తుందని మన మీద కోప్పడ్తారు. అందుకని, ఓ పన్చెయ్యండి. చచ్చిన ఈగలకి డిస్పోజల్ ఫీజుని పెట్టండి. ఫిఫ్టీ ఫిఫ్టీ'' అన్నారు.

''నాకు సెవెంటీ ఫైవ్'' అన్నారు క్లర్కు గారు బింకంగా.

ఈగ టాక్సుకు ఇది అదనపు సంపాదనే కనుక సరేనన్నారు ఆఫీసరు గారు.

కొద్ది రోజుల్లో హెల్త్ మినిస్టర్ గార్నించీ ఆఫీసరుగారికి ఫోన్ వచ్చింది.

''ఏవయ్యా, నిన్ను బిల్డింగ్ పర్మిట్లు సైన్ చెయ్యమంటే ఈగల్ని చంపించి, డిస్పోజ్ చేసే కార్యక్రమం చేపట్టావుట? అంత ఖాళీగా వున్నావన్నమాట'' అన్నారు ఆ మంత్రివర్యులు.

''అబ్బెబ్బే. అదేం లేద్సార్'' తడబడ్డాడు ఆఫీసరు గారు.

''ఓ పన్చెయ్యి. ఈగల్ని చంపితే ఎట్లాగో మలేరియా లాంటి వ్యాధులు స్ప్రెడ్ కాకుండా వుండడానికి తోడ్పడ్తుంది. పాత బాకీ అడగను, ఇవాళ్టి నుంచీ నీ ఫీజులో ముప్పావు నాది'' అని మారుమాట్లాడ్డానికి లేకుండా ఫోన్ పెట్టేశారు మంత్రిగారు.

''నీ ఫీజులో కూడా ముప్పావు నాదే ఇకనించీ'' అన్నారు ఆఫీసరు గారు క్లర్కుతో.

ఆఫీసరు గారు, క్లర్కుగారు సంపాదన కొరత వల్ల కలిగిన శిరోభారంతో వుండగా ఇంకొక బిల్డింగ్ – ఈసారి నాలుగంతస్తులది – కూలింది. అది కూడా కొత్తగా కట్టిన అపార్ట్‌మెంట్ బిల్డింగ్. పైన జన నష్టం కూడా కావడంతో ప్రభుత్వం విచారణకై ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీ, ఆఫీసరు గారిని కూలిన బిల్డింగ్‌కి ఇచ్చిన పర్మిట్‌ని పట్టుకురమ్మంది. సంతకం పెట్టిన తరువాత అప్లై చేసిన వాళ్ళకి ఇచ్చేశామని చెప్పారు ఆఫీసరుగారు.

''మీ దగ్గర కాపీ వుంచుకోలేదా? హవ్వ'' అని కమిటీ సభ్యులు నోళ్ళు తెరిచేసరికి ఆ గుహల్లో చేరబోతున్న ఈగల్ని చూడగానే ఆఫీసరు గారు అలవాటుగా వాటిని పట్టుకోబోయి సభ్యత కాదని ఆగిపోయారు.

''ఇకనుంచీ బిల్డింగ్ పర్మిట్లు ట్రిప్లికేట్‌లో చెయ్యండి. ఒక కాపీని మీ దగ్గర వుంచుకోండి. ఇంకొకటి హోం మినిస్టరు గారికి పంపించండి'' అని ఆజ్ఞల్ని జారీ చేసి పోయింది ఎంక్వైరీ కమిటీ.

''ట్రిప్లికేట్‌లో ప్రతి కాపీ మీద ఈగని పెడదాం సార్'' అన్నారు క్లర్కుగారు.

విచారణ సంఘం వారు బంగారప్పళ్ళెంలో వడ్డించిన ఆదేశాన్ని ఆఫీసరు గారు శిరసావహించబోతుంటే హోం మినిస్టరు గారి దగ్గర్నించీ ఫోన్ వచ్చింది – ముప్పాతిక వంతు తమదంటూ.

''ఒకట్లో ఒకటే కదా ముప్పావు? హెల్త్ మినిస్టర్‌కో ముప్పాతిక, ఈయనకో ముప్పాతిక ఎక్కణ్ణుంచీ తెచ్చే''దని తల బాదుకున్నాడు ఆఫీసరు గారు.

'ఓ పన్చెయ్యండి సార్. ట్రిప్లికేట్ కాబట్టి ట్రిబుల్ చేద్దాం. మొదటి కాపీ ముప్పాతిక ఒకళ్ళకీ, రెండో కాపీ ముప్పాతిక ఇంకొకళ్ళకీ'' అన్నారు క్లర్కు గారు.

''ఎంత మంచి సలహా ఇచ్చావయ్యా! నీకు ప్రమోషన్ తప్పకుండా ఇప్పించాలి'' అన్నారు ఆఫీసరు గారు.



''అయ్యబాబో, అంత పని చెయ్యకండి. అసలులోని ముప్పాతిక మీరే వుంచుకోండి. పిల్లలు గలవాణ్ణి. మావాడి ఇంజనీరింగ్, మా అమ్మాయి అమెరికా సంబంధం ఈ సీటు మీదే ఆధారపడి వున్నాయి'' అని కాళ్ళు పట్టుకున్నారు క్లర్కుగారు.

విచారణ సంఘం వారు బంగారప్పళ్ళెంలో వడ్డించిన ఆదేశాన్ని ఆఫీసరు గారు శిరసావహించబోతుంటే హోం మినిస్టరు గారి దగ్గర్నించీ ఫోన్ వచ్చింది – ముప్పాతిక వంతు తమదంటూ.

ప్రభుత్వం జారీచేసే బిల్డింగ్ పర్మిట్లు కట్టాల్సి వచ్చింది. ఆ బిల్డింగులు కట్టవలసిరావడానికి కారణం బిల్డింగ్ పర్మిట్లే కనుక, వాటిని కట్టడానికి అవసరమైన వనరుల్ని కూడా అక్కణ్ణించే రాబట్టడానికి ప్రభుత్వం నిశ్చయించి, పర్మిట్ల ఫీజుని పదిరెట్లు చేసింది. బిల్డింగులు కట్టడం వల్ల కాంట్రాక్టర్లు, రోజు కూలీగాళ్ళు చాలా సంతోషించారు. తమకి వోట్లు వేసేవాళ్ళు పెరుగుతున్నారని అధికార పార్టీ సంతోషించింది. ఆ బిల్డింగులన్నీ కట్టేసరికి కంప్యూటర్లు వచ్చాయి. డేటా అంతా కంప్యూటరైజ్ చేస్తే బావుంటుంది కదా అని హైటెక్ ముఖ్యమంత్రి గారికి ఆలోచన రావడంతో, కంప్యూటర్లు కొనడానికీ, వాటిలో డేటా ఎక్కించడానికీ కావలసిన వనరుల్ని... బిల్డింగ్ పర్మిట్ ఫీజుని పెంచి ప్రభుత్వం సమకూర్చింది. కంప్యూటర్ల ఉద్యోగాలు పెరిగినందుకు మధ్యతరగతి కుటుంబీకులు సంతోషించారు.

ఈలోగా, నాలుగంతస్తుల బిల్డింగులు కట్టడానికి పర్మిషనిస్తే దాన్ని ఐదంతస్తులు చెయ్యడమెలాగా అని ఆలోచించడానికి బిల్డర్లు జగజ్జెట్టీల్లాంటి కన్సల్టెంట్లని నియమించారు. వాళ్ళు ఆలోచించి, చించి, నాలుగంతస్తుల ఎత్తులోనే అయిదంతస్తులు కట్టమన్నారు. ఆ సలహా పాటించి, ఓ బిల్డరు ఒక అంతస్తు కట్టగానే దాని ఎత్తుని చూసి నవ్వి ఓ శకుని గారు, ''మామూలుగానే అయిదంతస్తులు కట్టవయ్యా, ఎవరన్నా అడిగితే లాయర్లు చూసుకుంటారు'' అంటారు.

ఆ సలహాని పాటించి ఓ బిల్డర్ ఒక బిల్డింగ్‌ని కట్టేసరికి, అటుగా పోతూ ఆ బిల్డింగుని చూసిన ఆఫీసరు గారు హాశ్చర్యపోయి, బిల్డర్ని ఆఫీసుకి పిలిచి దబాయించారు. ''హన్నా! చెప్పింది ఏమిటీ, నువ్వు చేసింది ఏమిటీ?'' అని.

''సిమెంటు నాణ్యమైనదే కనుక ప్రస్తుతానికి ఫైన్ కట్టించి వదిలేద్దాం సార్'' అన్నారు క్లర్కుగారు.

''ఎయిటీ, ట్వంటీ'' అన్నారు ఆఫీసరు గారు బిల్డరుగారు అటు వెళ్ళగానే.

ఒకడయిదంతస్తులు కట్టేసరికి ఇంకొకడు ఆరు, మరొకడు ఏడు, ఆపైన ఎనిమిదీ చొప్పున బిల్డింగుల ఎత్తులు పెంచుకుంటూ పోయారు. అంతస్తుతోపాటుగా ఫైన్ పెరుగుతూండేసరికి, ఆఫీసరు గారు మూడు అపార్ట్‌మెంట్లు, ఆరు కార్లు చొప్పున ఎదిగిపోవడం మొదలుపెట్టారు. ఈ ఎత్తుల వ్యవహారం, పర్మిట్ల వ్యవహారం ఒక క్లర్కే చూడడం కష్టంగా వుందని వారు డబ్బు లెక్కించడానికి ఒక కాషియర్ని కూడా నియమించుకున్నారు.

రాష్ట్రంలో ఉద్యోగుల సంఖ్య పెంచడానికి విదేశాల నుంచి బిజినెస్సులని పట్టుకొస్తానని చెప్పి రెండేళ్ళుగా విదేశాల్లో గడిపిన ఓ మంత్రిగారు ఇంట్లో అడుగుపెట్టిన తరువాత ఆశ్చర్యపోయారు. ''ఇదేమిటీ ఈ రెండేళ్ళలో సూర్యుడుదయించడం మానేసినట్టున్నాడే మా రాష్ట్రంలో'' అని. బయటికి వచ్చిన వెంటనే కారణం అర్థమైంది. ఆకాశహర్మ్యాల మధ్యలో తన రెండంతస్తుల ఇల్లుందని. ఆయన హుటాహుటిన ముఖ్యమంత్రి దగ్గరకెళ్ళి ఫిర్యాదు చేశారు. తన సమక్షంలో ఆ మంత్రిగారు తన గుండె మీద చెయ్యి వేసుకోగానే, ముఖ్యమంత్రి గారు ఆయన్ను హృద్రోగ చికిత్స నిమిత్తం మళ్ళీ ఫారిన్ పంపించారు.

వెంఠనే, మంత్రులే కాక అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా గుండెల మీద చేతులు వేసుకోవడం మొదలు పెట్టగానే ము.మం. గారు వాళ్ళను కూడా ఫారిన్ పంపించారు.

ఈ ఫారిన్ ప్రయాణ ఖర్చులకి డబ్బులెలాగా అని ఆలోచిస్తూ పురవీధుల్లో సంచరిస్తున్న ముఖ్యమంత్రి గారికి ఆశ్చర్యకరమైన దృశ్యం కనిపించింది. వీధికి రెండుప్రక్కలా కట్టబడిన బిల్డింగులు, ఎదిగిన చెట్లలాగా – అంటే, క్రింద చిన్న సైజు కాండాన్ని మాత్రం కలిగి వుండి, పైన మాత్రం విరిసిన కొమ్మల్లాగా విస్తరించి వున్నాయి.అది కూడా వెనక వేపుకు కాకుండా ఒక్క వీధివైపే అలా విస్తరించి వుండడంతో సగం గొరిగి వదిలిపెట్టిన ఋక్మి తలలాగా కనిపిస్తున్నాయి. ''బిల్డింగులు కట్టడంకోసం చెట్లన్నీ నరికించడం వల్ల అశోకుడు రోడ్లకి రెండువైపులా నాటించిన చెట్లు పురాణ ఇతిహాసాల్లాగా హరికథల్లో మాత్రమే మిగిలిపోయాయి కానీ, లేకపోతే రోడ్డుకి రెండువైపులా చెట్లుంటే ఇట్లా వుండేదన్నమాట!'' అనుకుని, మళ్ళీ అంతలోనే, ''ఆహా! రోడ్డు రెండుప్రక్కల నుండీ పైకి లేచి, రోడ్డు మధ్యలో పైఅంతస్తులు ముద్దుపెట్టుకుంటున్నట్టు బిల్డింగులు కట్టిన ఏమీ ఈ మానవుడి ప్రతిభ'' అని ము.మం. గారు ముందు అచ్చెరువొందినా, ఎవరూ తమని కన్సల్టు చెయ్యలేదనీ, తన వాటా ఇవ్వలేదనీ గుర్తుకొచ్చి అగ్రహోదగ్రులై, ఆఫీసరు గారిని తన ముందుకు రప్పించారు.

''ఎందుకిలా జరుగుతోంది?'' అని తీవ్రంగా వారిని ప్రశ్నించారు.

''బిల్డింగులు ఏవీ కూలడం లేదు కద్సార్!'' అన్నారు ఆఫీసరుగారు బుర్ర గోక్కుంటూ.

''బిల్డింగులు పర్మిట్లు తీసుకున్న ప్రకారం కడుతున్నారా?'' గద్దించాడు ము.మం. గారు.

''తెలీద్సార్''

"తెలీదా?" ఆశ్చర్యపోయారు ము.మం. గారు.

"ఎన్ఫోర్స్‌మెంట్ రెస్పాన్సిబిలిటీ మా శాఖది కాదన్నార్."

ఆపైన, ఎడతెరిపి లేకుండా ఎదిగిపోతున్న భవనాల బాధల్నుండీ ప్రజలను రక్షించాలన్న సదుద్దేశంతో బిల్డింగ్ రెగ్యులేషన్ ఎన్ఫోర్స్ శాఖని ప్రభుత్వం వారు వేశారు. ఆ శాఖలో ఆఫీసర్లు, తెలుగు సినిమాలో టీనేజర్లు లవ్వాడుకుంటుంటే గిట్టని తల్లిదండ్రులు వారిని విడదీసినట్లుగా ఆకాశంలో ముద్దులు పెట్టుకుందామని దగ్గరైన బిల్డింగుల్ని నిర్దాక్షిణ్యంగా కూలగొట్టించారు. మేడ కట్టుకుంటున్నప్పుడు అడ్డెందుకు చెప్పలేదన్న ఇంటి ఓనర్ల ప్రతిఘటనని అడ్డుకునేటందుకు పోలీసుల్ని కూడా ఉపయోగించాల్సి వచ్చింది. ఈ ఖర్చులన్నింటినీ భరించడం కోసం బిల్డింగు పర్మిట్ల ఫీజు మళ్ళీ పెంచుదామనుకున్నారు ము.మం. గారు. బిల్డింగ్ పర్మిట్ల ధరని మరీ పెంచితే ప్రభుత్వ మనుగడకి మోసం వస్తుందన్నారు ఖరీదైన కన్సల్టెంట్లు.

ప్రజలలో నెలకొన్న ప్రతిఘటనకి చిరాకు చెందిన ము.మం. గారు ఇంతకాలం బిల్డింగ్ పర్మిట్ ఆఫీసరు తనకి వాటా ఇవ్వనందుకు కొన్ని కోట్ల ధనాన్ని ఆఫీసరు గారి చేత తన స్విస్ బ్యాంక్ అకౌంట్లో కట్టించారు.

బిల్డర్లు కట్టడానికీ, ఆ తర్వాత సామాన్య ప్రజలు అపార్టుమెంట్లు కొనుక్కోవటానికి అప్పులిచ్చి వడ్డీలు విపరీతంగా చేసుకుంటున్న బాంకులని, "నా వాటా ఏద"ని ప్రశ్నించడానికి ము.మం. గారు ఒక శాఖని ఏర్పాటు చేశారు. బాంకుల వారు ప్రభుత్వం వారిస్తున్న డబ్బులని ఋణాలు తీసుకుంటున్న వారిని కట్టమన్నారు. తీసుకుంటున్న లక్షల ఋణాల్లో అది చాలా చిన్నమొత్తమే కనుక అప్పు కాగితాల మీద సంతకం చేసే వాళ్ళెవరూ పెద్దగా పట్టించుకోలేదు. కొద్దిగా అతితెలివి కలిగినవాళ్ళు పట్టించుకుందామనుకున్నా ప్రయోజనమేమీ లేదని గ్రహించి చూపించిన చోట సంతకం చేసి వూరుకున్నారు.

ప్రభుత్వం, ప్రజలకి చేసే సేవల్ని పెంపొందించడానికి డబ్బులు చాలడం లేదని ఒకపక్కనుంచీ టాక్సుల్ని పెంచి, ఇంకోపక్కనుంచీ ప్రపంచ బాంక్ నుంచీ అప్పులు పట్టుకొచ్చింది.

అప్పుడప్పుడూ భవనాలు కూలుతూనే ఉన్నాయి. ఒక భవనం కూలినప్పుడు దాని సైజుకి తగినట్లుగా ఎంక్వయిరీ కమిషన్ని నియమించడం, ఆ కమిషన్‌లో సలహా మేరకు కొంతమందిని ప్రభుత్వం ట్రైనింగ్ కోసమని విదేశాలకి పంపడం, చూడ్డానికీ, వినడానికీ, అందరికీ అలవాటైపోయింది.

***

"కుక్కల బాధనుంచీ విముక్తి పొందాలంటే ఏనుగుని పెంచుకోవాలన్న మాట" అన్న ఆలోచన వచ్చిన ఆ యింటి యజమాని ఆరోజు సర్కస్ డేరా దగ్గరికి వెళ్ళడం మంచిదైంది. – ఎందుకంటే, అక్కడ అతను అదుపు తప్పి విధ్వంసకాండని జరుపుతున్న ఏనుగుని చూశాడు. ఆ ఏనుగుని అదుపులోకి తెచ్చుకోవటానికి కష్టపడుతున్న వాళ్ళని చూసి, "ఎందుకంత కష్టపడతారు? ఓ ఎలుకని చూపిస్తే సరి, అదే దారిలోకి వస్తుంది" అని సలహా ఇచ్చాడు. వాళ్ళు చిరాగ్గా, "నీలాంటి వాళ్ళు పుస్తకాలు చదివి సంపాయించిన జ్ఞానమిది. ఏనుగుతో మసిలి కాదు. ఏనుగుకి ఎలుకలంటే భయం లేదు" అని జవాబిచ్చారు. "అంటే, నేను నిజంగా ఏనుగుని తెచ్చుకుని పెంచుకుని వుంటే నా పరిస్థితి..." అని మొదలైన ఆలోచనని అర్ధాంతరంగా ఆపేసి, "పుస్తకాల్లో తప్పెందుకు రాస్తారు?" అన్న ఆలోచనలోకి దిగాడు. పుస్తకాల్లో తప్పుడు సమాచారాల నందించకుండా వుండేలా ... ప్రభుత్వం చర్య తీసుకోవాలనుకున్నాడు కూడా.

***

అదుపు లేకుండా మత్తగజంలాగా విచ్చలవిడిగా ప్రభుత్వం ప్రవర్తిస్తోందన్న విమర్శ వినగానే, వినాయకుడికి కోపం వచ్చిందని, ఆ కోపాన్ని తగ్గించడానికై వూరూరా వినాయకచవితి రోజున సక్రమంగా, ఘనంగా పూజలు జరపడానికై ప్రభుత్వం కొత్త కాబినెట్ లెవెల్ డిపార్ట్‌మెంట్‌ని తెరిచింది.

ప్రభుత్వం సైజుని తగ్గిస్తామని హామీలిచ్చి పదవుల్ని పుచ్చుకున్న ప్రెసిడెంట్ల హయాంలో కూడా ప్రభుత్వం సైజు పెరిగిందే కానీ తగ్గలేదు. ప్రతీ దేశంలోనూ, ఎన్నికల్లో గెలిచిన పార్టీలు మారినా కూడా అవి ప్రభుత్వ వైఖరిని ఏమాత్రం మార్చలేకపోయాయి. ఎన్నికల్లో ఏదో ఒక పార్టీని గెలిపించక తప్పదని ప్రజానీకం నిరాశపడటం దానికి కారణం కావచ్చు.

ఈ పరిస్థితిని మార్చడానికి దశమావతారం ఒక్కటే పరిష్కారమార్గంగా కనిపిస్తోంది. మొదటి మూడు యుగాల్లోనూ, తొమ్మిది అవతారాల్లోనూ, సంహరించటానికి ప్రతిసారీ ఒకడే మాయావి వున్నాడు – తెలుగు సినిమాల్లో హీరోని కొట్టడానికి విలను అనుచరులు ఒకటి వెనుక ఇంకొకడు క్యూలో వచ్చినట్టుగా. కలియుగంలో ఆ మాయావి తన తెలివితేటల్ని బాగా పెంపొందించుకున్నట్టున్నాడు. అన్నిటికీ ప్రభుత్వమే పరిష్కార మార్గాన్ని చూపించాలనే ఆలోచనను కలిగిస్తూ మనుషుల మనసుల్లోనూ వున్నాడు. ఎన్నో వేల ఏళ్ళనుండీ విస్తరించిన మర్రిచెట్టులా అంతు ఎక్కడుందో తెలియని ప్రభుత్వ రూపంలోనూ ఉన్నాడు. దశమావతారంలో యుద్ధం కొన్నిరోజులపాటు జరుగుతుందా లేక కొన్ని యుగాలపాటా? ఎప్పుడో ఒకప్పుడు ప్రభుత్వం అచ్చువేసిన పుస్తకాన్ని చదివి తెలుసుకోవాల్సిందే!

★

